# బృందావనం

**-అల్లూరి గౌరీలక్ష్మి**

బృందావనంలో ఉదయం అయిదు గంటలకు రెండు అలారాలు ఒకే సారి మోగాయి. ఒకటి ఆడవాళ్ళు పడుకునే హాల్లో. మరొకటి మగవాళ్ళు పడుకునే హాల్లో.

అంతా చకచకా నిద్రలేచి చెప్పులేసుకుని వాకింగ్‌కి బయలుదేరారు. చిన్నచిన్న గుంపులుగా మాట్లాడుకుంటూ నడుస్తున్నారు వాళ్లు.

"అలా పెళ్ళి నడకలు నడవకండర్రా! మార్నింగ్ వాక్ అంటే బ్రిస్క్‌గా నడవాలి. శరీరమంతా కదలాలి. నేను చూడండి ఎలా నడుస్తున్నానో" అంటూ జగన్నాథ్ నడిచి చూపించాడు. వెంటనే సరిగ్గా అలాగే నడిచి చూపించింది సావిత్రి.

"గుడ్ సావిత్రి! కరెక్ట్‌గా నడిచావ్!" అన్నారంతా. సావిత్రి సిగ్గుపడింది. "ఆమెని పొగడ్డం కాదు. మీరంతా అలా నడవండి" అన్నాడు జగన్నాథ్ హెడ్‌మాస్టారిలా.

అందరూ బాగా నడవాలని ప్రయత్నించడంతో కొందరికి రాకపోవడం, దాంతో ఒకరినొకరు వెక్కిరించుకోవడం జరిగింది. "ఇప్పుడు నడకలు నేర్చేవయసు నేర్వండి" అన్నారెవరో. ఆ మాటలతో అక్కడంతా నవ్వులు విరిశాయి.

"రాత్రి నాకు సరిగా నిద్రలేదబ్బా" అంది రాధ. ఎందుకన్నట్టు చూసింది శారద.

"అదేనే, చెప్పాను కదా! రాంబాబు నన్ను పెళ్ళి చేసుకుంటానని ప్రపోజ్ చేశాడు కదా!"

"మరే! ఏమాలోచించావ్?"

"ఇన్నాళ్ళూ ఒంటరిగా బ్రతికానుకదా! ఇప్పుడెందుకే కొత్త జంఝాటం అనిపిస్తోందే"

"నా సలహా అడిగితే చేసుకోమనే చెబుతాను. నీ జీవితానికి ఒక కొత్త మలుపు వస్తుంది. ఒక థ్రిల్ ఉంటుంది. రాంబాబు నన్నడిగితే నేను వెంటనే ఒప్పుకునే దాన్ని. రాంబాబుకి ఏం తక్కువ? మంచి మనసు, సంస్కారం ఉన్నాయి."

శారద మాటలకి రాధ మొహంలో గర్వం, ఆనందం తొంగి చూశాయి. దూరం నుంచి రాధనే గమనిస్తున్న రాంబాబు అవకాశం వచ్చినా రాధ దగ్గరికి రాలేదు. దూరంగా మరో గుంపులో కలిసిపోయాడు. ఆమె ఏదన్నా ఇబ్బంది పడుతుందేమో అన్నట్టుగా.

"ఝాన్సీ, గాయత్రీ, విజయా రాలేదు వాకింగ్‌కి" అందర్నీ తేరిపార చూస్తూ అన్నారెవరో!

"రాత్రి సెకండ్ షోకి వెళ్ళారు కదా పాపం ఏం వస్తారు?"

"అయినా వీళ్ళకి సినిమా పిచ్చి ఎక్కువయ్యింది. వీళ్లు ముగ్గురే వెళ్ళారా ఎవరూ తోడు లేకుండా?"

"వాళ్ళ బాడీ గార్డ్, జిగ్‌రీదోస్త్ కృష్ణారావ్‌ని తీసుకెళ్ళారే".

"అందుకేనా, వాడు కూడా వాకింగ్‌లో లేడు?"

"ఒక రోజు మనమంతా కలిసి వెళదాం. బిర్లామందిర్‌కీ, ప్లానిటోరియంకీ" ఎవరో ప్లాన్ వేస్తూ అన్నారు.

"సరే! ఓ.కే." అంతా ఆనందంగా అరిచారు.

అలవాటుగా వాళ్ళంతా కూర్చునే పూలతోట వచ్చింది. మొత్తం ఇరవై మందీ అక్కడ బైఠాయించారు. ప్రతి రోజూ అది వాళ్ళకొక చిన్నహాల్ట్. కొంత అలుపు తీర్చుకుని తిరిగి ఉత్సాహంగా నడక సాగిస్తారు వాళ్ళు.

"మన నరసింహారావు కోసం 'వధువు' కావలెను ప్రకటన ఇద్దామనుకున్నాం కదా ఏమయ్యింది." లక్ష్మణ్ అడిగాడు.

"ఒకసారి ఊ అంటాడు. ఒకసారి నో అంటాడు" ఎవరో సమాధానం చెప్పారు.

"అసలు వాణ్ణి అడిగేదేంటి? ప్రకటన ఇచ్చెయ్యండి. డబ్బులు నేనిస్తా" అన్నాడు రామారావ్.

"ఆ పని చేసి ఆ పెళ్ళి కూడా నువ్వే చేసుకో" అన్నాడు నరసింహారావు. అంతా గొల్లుమన్నారు.

"అవును గానీ, సుజాత, సుబ్బలక్ష్మీ కనబడరేమీ?" అడిగిందొకావిడ.

"సుజాతకి కాస్త జ్వరంగా ఉందట నిన్నటినుంచీ, ఆమెకి తోడుగా సుబ్బలక్ష్మి ఉండిపోయింది."

"అవునా! అయితే మనమంతా ఇప్పుడక్కడికే వెళదాం పదండి" అన్నాడు జగన్నాధ్ లేస్తూ.

తిరుగు ప్రయాణంలో అంతా సుజాత రూమ్‌వైపు దారి తీశారు. ఒక్కసారిగా అంతా వచ్చేసరికి సుజాత ఆనందంగా లేచి కూర్చుంది. 'చూడండ్రా ఏం తిననంటోంది" అంది సుబ్బలక్ష్మి బ్రెడ్, పాలు తెస్తూ.

"తిను తల్లీ, తిను' అంటు అంతా చుట్టు మూగేసరికి సుజాత బుద్ధిగా బ్రెడ్ తినేసి, పాలు తాగేసింది. టాబ్లెట్ కూడా మింగింది.

"మూడు రోజులకల్లా మాతో వాకింగ్‌కి రావాలి" అన్నాడు రామారావు లేస్తూ.

"నేను వాకింగ్‌కి వచ్చేవరకు మీరంతా రోజూ నా రూమ్‌కి రావాలి" అంది సుజాత అభ్యర్ధనగా.

"దానికేం భాగ్యం రోజూ ఇలాగే వస్తాం" అన్నారంతా లేస్తూ. "థాంక్యూ ఫ్రెండ్స్" అంది సుజాత గుమ్మం దాకా వస్తూ

ఆదివారం సాయంత్రం నాలుగు కాగానే అంతా చకచకా స్నానాలు చేసి తయారయ్యారు. మరో అరగంటలో రకరకాల అందమైన కార్లొచ్చి ఆగాయి బృందావనం ముందు. అందులోంచి ఆడా, మగా పిల్లలు దిగారు.

బృందావనవాసులంతా వాళ్ళని చూసి మైమరిచిపోయారు. వాళ్ళతో కబుర్లు, నవ్వులు. ఆనందం వెల్లి విరిసింది బృందావనం ఆవరణంతా. వచ్చిన పెద్దవాళ్ళతో ముచ్చటించారు. పిల్లలతో కలిసి ఆడారు పాడారు. సాయంత్రం ఆరుకాగానే కార్లలో వచ్చిన వాళ్ళంతా వాళ్ళు తెచ్చిన స్వీట్స్, పళ్ళు ఇచ్చి అందరి వద్దా సెలవు తీసుకుని వెళ్ళిపోయారు. ఒక్కసారిగా అక్కడ వాతావరణం గంభీరంగా మారిపోయింది. కార్లు వెళ్ళిపోగానే.

పది నిమిషాలు ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మునిగి పోయారు. కొందరి కళ్ళు చెమరించి ఉన్నాయి. అందరి హృదయాలూ బరువెక్కి ఉన్నాయి.

ఇంతలో వంటావిడ రత్నం వాచ్‌మెన్‌ని తీసుకుని వచ్చింది. అతని చేతిలో చల్లటి మంచినీళ్ళ సీసాలు, ప్లేట్లు ఉన్నాయి.

రత్నం ప్లేట్లు తీసి వాటిలో ఇప్పుడొచ్చిపోయిన వాళ్ళిచ్చిన స్వీట్లు సర్దింది. ఒక పెద్ద ప్లేట్ తీసుకుని పళ్ళుముక్కలు చేసి అందులో పెట్టింది.

అందరి మధ్యలో టీపాయ్ పెట్టి దానిపై పళ్ళ ముక్కలున్న ప్లేట్ పెట్టి, ప్రతి ఒక్కళ్ళ చేతిలో స్వీట్, హాట్ పళ్ళాలు పెట్టింది.

"అవన్నీ వచ్చిపోయే అనుబంధాలు. మనదే ఇక్కడ నిజమైన బంధం" అంది రత్నం అందరి వైపు ప్రేమగా, దయతో కన్నతల్లిలా చూస్తూ. అందరూ ఆమె వైపు బిక్కమొహంతో చూశారు.

"తినండి, తినండి చాయ్ మరుగుతోందక్కడ! వాకింగ్‌కి వేళయింది" అన్న రత్నం మాటలతో అంతా తినడాని కుపక్రమించారు.

అక్కడున్న వాళ్ళంతా అరవై ఏళ్ళు పైబడ్డ వాళ్లు. అది ఒక వృద్ధాశ్రమం. మళ్ళీ వచ్చే ఆదివారం వాళ్ళ రక్త సంబంధీకుల రాక కోసం వాళ్ళంతా, ఆశగా, పసిపాపల్లా ఎదురు చూస్తూ ఉంటారు.

◉

## తియ్యదనం

**తె**లుగు భాష తీపి
పుస్తకాల నిండా
తెలుగువాడి నోట
ఆంగ్లం ఖయిమా.

*- గణపతిరాజు నరసింహరాజు*

Edited, Printed and published by Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033. E-mail: patrika@hotmail.com. Printed at Dharani Printers, 6-2-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004.